కార్తికేయనగర్ వంతెన ప్రారంభం



కార్తికేయనగర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని కార్తికేయనగర్ కాలనీలోని నాలా పై రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన వంతెనను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెనోఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం వద్ద వంతెన నిర్మాణానికి రూ.94 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే అక్కడా బ్రిడ్జి పనులు ప్రారంభమవుతాయన్నారు. నాచారం సమగ్ర అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీఈ రూప, నాచారం ఏఈ లింగారావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, స్థానిక బీఆర్ఎస్ నేతలు, కార్తీకేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

అల్వాల్: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం అల్వాల్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు వారి నివాసాల్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైల ఆలయ ప్రసాదాన్ని అందజేశారు. మంత్రులను కలిసిన వారిలో అల్వాల్ సొసైటీ మాజీ చైర్మన్ తోట ధర్మేంద్‌రెడ్డి, తూంకుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీష్‌గౌడ్, సీనియర్ నాయకులు బొరంపేట్ మధుసూదన్‌రెడ్డి, వీరన్న, భోజిరెడ్డి, చింతల మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



నాచారంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

మల్లాపూర్: ఉచిత బస్సు ప్రయాణ పథకంతో రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నాచారం హెచ్ఎంటీ నగర్‌లో ఆటో డ్రైవర్లు, యూనియన్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు ఉపాధిలేక రోడ్డున పడ్డారన్నారు. ఉచిత ప్రయాణానికి నిరసనగా ఈ నెల 19న సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సును ఆటో డ్రైవర్లు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ వ్యాన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ఆటో యూని యన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాండునాయక్, ఉపాధ్యక్షులు శాతం రమేష్, రాష్ట్ర కార్యదర్శి నరసింహ, మేడ్చల్ అధ్యక్షులు నిరంజన్ రాజు కుమార్, హనీఫ్, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్స్ ఫెలోషిప్ గ్రాండ్ క్రిస్మస్



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు

ఉప్పల్: హోరేబు మినిస్ట్రీస్ అండ్ యూసీపీడబ్ల్యూ ఫౌండర్ చైర్మన్ గోన పిలిప్స్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఉప్పల్‌లోని కొమ్మిడి కృష్ణారెడ్డి గార్డెన్‌లో క్రిస్మస్ సెలబ్రేషన్స్ అంగరంగ వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ సువార్తకుల కేఏపాల్ హాజరయ్యారు. క్రీస్తు జన్మదినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక పాస్టర్స్, బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, గొల్లూరి అంజయ్య, సురేష్ శ్యాం, జేరుసలేం మత్తయ్య, గోన అనిల్, జంపాల రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

శివసాయినగర్ కాలనీ అధ్యక్షుడిగా పద్మారెడ్డి



శివ సాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, శివసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎంపల్లి పద్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొండగళ్ల అశోక్, ఉపాధ్యక్షుడిగా కానుల సురేష్‌గౌడ్, నారా నరసింహులు, కోశాధికారిగా నరికొండ రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ మరోమారు కాలనీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు ఘనంగా సత్కరించారు.

ఘనంగా జన జాతీయ గౌరవ దివస్



గిరిజన విద్యార్థులతో శాస్త్రవేత్తలు

ఉప్పల్: విద్య, వ్యవసాయం, ఆరోగ్యం తదితర రంగాల్లో గిరిజనుల అభివృద్ధికి మరిన్ని శాస్త్ర సాంకేతిక అంశాలు అవసరమని ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ డా అశోక్ కుమార్ అన్నారు. సీఎస్ఐఆర్,ఎన్‌జీఆర్ఐ ఆధ్వర్యంలో భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా శుక్రవారం 'జన జాతీయ గౌరవ దివస్' నిర్వహించారు. పరిశోధన అభివృద్ధి తదితర కార్యశాలపాలపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు

- కంపు కొడుతున్న పరిసరాల బస్తీలు, కాలనీలు
- గార్డులను నియమించినా ఫలితం శూన్యం
- సుందరీకరణ చేపట్టాలంటూ స్థానికుల డిమాండ్



చిన్నబోయిన చిన్న చెరువు



ఎఫ్‌టీఎల్‌లో సీసీ రోడ్డు వేసిన దృశ్యం

రామంతాపూర్ : రామంతాపూర్ డివిజన్‌లో పలు కాలనీలు, బస్తీల మధ్య ఉన్న చిన్న చెరువు కనుమరుగవుతోంది. గతంలో 19.2 ఎకరాల విస్తీర్ణంలో స్థానికులకు తాగునీరు పొలాలకు సాగునీటి వనరుగా ఉండేది. ఎందరో గంగపుత్రులు ఈ చెరువుపై ఆధారపడి జీవనం సాగించేవారు. ప్రస్తుతం చెరువు 10 ఎకరాలు మిగిలింది. ప్రభుత్వం మిషన్ కాకతీయలో భాగంగా నగరంతో పాటు శివారులోని చెరువులు, పూడికలు తీసి వ్యర్థాలు, గుర్రపు డెక్కను తొలగించి సుందరీకరణ పనులు చేపట్టారు. అయితే ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో కారణంగా చిన్న చెరువులో మిషన్ కాకతీయ కార్యక్రమం చేపట్టకపోవడం గమనార్హం.

ఎఫ్‌టీఎల్‌లో సీసీ రోడ్డు నిర్మాణం

- నిబంధనలకు విరుద్ధంగా చిన్న చెరువులో జీహెచ్ఎంసీ అధికారులు సీసీ రోడ్డు వేశారు. కబ్జాదారులకు సౌకర్యంగా ఉండేందుకే ఈ రోడ్డు వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాలుష్య కాసారంగా..

- చెరువుపై పర్యవేక్షణ లేకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు దీనిని డంపింగ్ యార్డుగా మారుస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తుండటంతో చెరువు కాలుష్య కాసారంగా మారింది. సమీప బస్తీలు, కాలనీల వాసులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు.
- కలుషిత జలాల కారణంగా సమీప కాలనీల బస్తీల్లోని బోర్‌వెల్ పంప్‌లో రంగుతో కూడిన కలుషిత జలాలు వస్తున్నాయి.
- చెరువులో వ్యర్థాలు వేయకుండా చెరువు స్థలాలు కబ్జా కాకుండా కాపాడేందుకు జీహెచ్ఎంసీ 8 మంది గార్డులను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయింది. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన సుందరీకరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. చెరువు శిఖం భూమి తమదేనని కొందరు ఎన్నో ఏళ్లుగా న్యాయస్థానంలో కేసులు వేశారు. అదే విధంగా చెరువులోని కబ్జాలను తొలగించి సుందరీకరణ చేయాలంటూ కొన్ని ప్రజా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు న్యాయస్థానాలను ఆశ్రయించాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని చెరువు స్థలాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా చిన్న చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేసి చెరువు భూములను కాపాడాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

కాలుష్య నియంత్రణకు చర్యలు



రామంతాపూర్ చిన్న చెరువులో చెత్త వ్యర్థాలతో నిండిపోయి కాలుష్యకాసారంగా మారిన విషయం వాస్తవమే. ఎన్నికల ప్రచారంలో భాగంగా చెరువును పరిశీలించా. స్థానిక ప్రజలు, ప్రజా సంఘాలు కూడా చెరువు కాలుష్యంపై ఫిర్యాదులు చేస్తున్నారు. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ కింద చెరువులోని చెత్తాచెదారం ఇతర వ్యర్థాలను తొలగించి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. చిన్న చెరువు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి త్వరలోనే సుందరీకరణ పనులు చేపడతాం.

– బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే

ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలి



చిన్న చెరువు కాలుష్యకాసారంగా మారింది. ఒకప్పుడు ఈ చెరువులో స్థానిక గంగపుత్రులు చేపలు పట్టి ఉపాధి పొందేవారు. ప్రస్తుతం పెంపకానికి వేసిన చేపలు కూడా మృతి చెందుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు సమన్వయంతో చెరువుకు పూర్వ వైభవం తేవాలి.

– మల్లయ్య, రాష్ట్ర గంగపుత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు

అభినందనలు



మల్లాపూర్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను శుక్రవారం నాచారం ప్రాంతానికి చెందిన పలువురు నేతలు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఆర్ మోహన్, ప్రమోద్ మహారాజ్, డాక్టర్ చీమా శ్రీనివాస్, ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: డివిజన్ పరిధిలోని మంగపురం కాలనీలో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను శుక్రవారం కార్పొరేటర్ ప్రభుదాస్ పరిశీలించారు. కాలనీలోని వెంకటేశ్వరస్వామి వెనుక నిత్యం డ్రైనేజీ పొంగి పొర్లుతుండటంతో స్థానికులు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన కొత్త పైప్‌లైన్‌కు ప్రతిపాదనలు చేసి పైప్‌లైన్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కుషాయిగూడ: నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చర్లపల్లి డివిజన్, సాయినగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భగా బీఎల్ఆర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో చర్చించి నివేదికలు సిద్ధం చేయిస్తున్నట్లు తెలిపారు. దశలవారీగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయడంతో పాటుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, అనిల్ ముదిరాజ్, జౌండ్ల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

ఫుట్‌బాల్ గ్రౌండ్‌లోకి అందరినీ అనుమతించాలి

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లోకి అందరినీ అనుమతించాలని ఓల్డ్ అల్వాల్ వాసులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి ఫుట్‌బాల్ ప్లే గ్రౌండ్ ప్రైవేటైజేషన్ విషయమై చర్చించారు. ఉదయం వేళల్లో ఫుట్‌బాల్ గ్రౌండ్‌లోకి వాకర్స్‌తో పాటు ఎవరినీ రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే జోనల్ కమిషనర్‌తో ఫోన్ చేసి ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు వాకింగ్ చేసేవారిని, గతంలో గ్రౌండ్ నిర్వాహకులను అనుమతించాలని కోరరారు. దీనిపై అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోని పక్షంలో గ్రౌండ్ నిర్వాహకులు, కాలనీ వాసులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కే. శ్రీనివాసవర్మ, ప్రవీణ్, రవీందర్, రాములు, నవీన్, నరసింహ, మురళి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో ఓల్డ్ అల్వాల్ వాసులు

వీధి కుక్కల నియంత్రణకు బ్లూక్రాస్‌తో ఒప్పందం



సమావేశంలో పాల్గొన్న మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కమిషనర్ సమ్మయ్య నాయక్

మేడిపల్లి: వీధి కుక్కల నియంత్రణకు బ్లూక్రాస్ సంస్థతో పీయంసీ ఒప్పందం కుదుర్చుకుంది. పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య నాయక్ బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ డైరెక్టర్ ఎస్ఎస్‌కె కుమారి, మేడ్చల్ జిల్లా యానిమల్ వెల్ఫేర్ బోర్డు మెంబర్ ప్రవల్లికతో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జరిపిన సమావేశంలో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..నగర పరిధిలో ఇప్పటికే వీధి కుక్కల నియంత్రణకు బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి శస్త్ర చికిత్సలు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కుక్కల బెడదను పూర్తిగా నివారించేందుకు బ్లూక్రాస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కుక్కలకు ఆపరేషన్లతో పాటు రేబీస్ వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేయించనున్నట్లు తెలిపారు.

మాజీ మంత్రి మల్లారెడ్డి భూములపై సమగ్ర విచారణ జరిపించాలి

శామీర్‌పేట్: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆస్తులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం మేడ్చల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండలం, కేశవరం గ్రామపరిధిలో గల 33, 34, 35 సంబర్లలోని గిరిజనులకు చెందిన 47. 18 ఎకరాల భూమిని ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆక్రమించాడనే ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ సదరు స్థలాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ...మల్లారెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని కుత్బుల్లాపూర్, మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి, కీసర మండలాల్లోని ప్రభుత్వ, శిఖం భూములను కబ్జా చేశాడన్నారు. అసైన్డ్ భూముల చట్టాన్ని తుంగలో తొక్కి, సదరు భూములను కొనుగోలు చేశాడని ఆరోపించారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన మల్లారెడ్డిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు శ్రీరామ్ నాయక్, శోభన్, చంద్రశేఖర్, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ ..



కుషాయిగూడ: యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను గురువారం రాత్రి మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

కొబ్బరి కాయల దుకాణ నిర్వహణకు వేలం

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానం ఆవరణలో కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యాలు విక్రయించేందుకు గాను శుక్రవారం దేవాదాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. సంవత్సర కాలం దుకాణం నిర్వహించుకోవడానికి రూ 2,97,000/- మంజిరి మహేష్ వేలం దక్కించుకున్నట్లు ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

అప్రమత్తతే రక్ష



కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు

మల్కాజిగిరి: బాలికలు,మహిళలు అన్ని రంగాల్లో ముందుండటమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ప్రియాంక అన్నారు.బాలికల ప్రాథమిక పాఠశాలలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు హక్కులు , ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్మిక చట్టాలు, పోక్సో చట్టాలు, 100,181,1098,14567,155326 టోల్ ఫ్రీ నంబర్ల పై అవగాహన కల్పించారు.

ఉద్యమకారులను గుర్తుంచుకుంటా



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకన్న

మల్కాజిగిరి: తన విజయంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారులను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఉద్యమ సమయంలో మల్కాజిగిరి జేఏసీ చైర్మన్‌గా పనిచేసిన వెంకన్న ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమకారులు సమన్వయంతో పనిచేయడానికి కృషి చేసిన వెంకన్నను ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్తులో వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

నేడు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జాబ్ మేళా

అల్వాల్: మేడ్చల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 16న శనివారం ఉదయం జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలోని రూమ్ నెంబర్-9లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.వై. నిర్మల తెలిపారు. రిలయన్స్ జియో హైదరాబాద్ ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. జియో పాయింట్ అసిస్టెంట్ మేనేజర్, ఎంటర్‌ప్రైజ్ సేల్స్ ఆఫీసర్స్, జియో డిజిటల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్, డిప్లొమాతో పాటు డిగ్రీ చదివి ఉండాలన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు www.nic.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 7386809422 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్



సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు చేతన, శ్రీవాణి

హబ్సిగూడ: భారత మాజీ ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం హబ్సిగూడలోని ఆయన విగ్రహానికి హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్, రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని, దూరదృష్టితో కూడిన రాజనీతిజ్ఞతను, అసాధారణమైన అంకితభావాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ సహజయోగ యువశక్తి సమ్మేళనం

మేడిపల్లి: అంతర్జాతీయ సహజయోగ యువశక్తి సమ్మేళనం ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్, పలని కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సహజయోగ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరికృష్ణ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

మహిళపై దాడి, గొలుసు చోరీ

మల్కాజిగిరి: ఓ మహిళ పై గుర్తుతెలియని యువకులు దాడి చేసి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ జగన్నాథ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..పీవీఎన్ కాలనీకి చెందిన కవిత గురువారం రాత్రి తన కుమారుడితో కలిసి బైక్‌పై వస్తుండగా గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు వారిపై దాడి చేసి ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల వేలం

మేడ్చల్: అక్రమంగా మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను శనివారం మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వేలం వేస్తున్నట్లు సీఐ నవనీత తెలిపారు. రెండు ద్విచక్రవాహనాలను వేలం వేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తిగల వారు లోబడి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.